క్లుప్తంగా

రెచ్చిపోతున్న మట్టి మాఫియా!

రేణిగుంట : శ్రీకాళహస్తి మండలంలో మట్టి మాఫియా రెచ్చిపోతున్నారు. మంగళవారం మండలంలోని రాచగున్నేరి సమీపంలో మట్టిని జేసీబీలతో తవ్వి పెద్ద ఎత్తున తరలిస్తున్నట్లు ఫిర్యాదులు అందడంతో రూరల్ పోలీసులు దాడులు చేసి ఓ జేసీబీ, రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అయితే అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లు రావడంతో కేసు నమోదు చేసేందుకు పోలీసులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

చారిటబుల్ ట్రస్టు అభివృద్ధికి కృషి

శ్రీకాళహస్తి : పట్టణంలోని ఓరుగంటి రామలింగయ్యశెట్టి, మంగమ్మ చారిటీస్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కలశ స్థాపన చేసి వాసవీ మాత చిత్రపటానికి విశేష పూజలు చేశారు. అనంతరం గౌరవాధ్యక్షుడిగా కోటిలింగాల దయాగుప్తా, చైర్మన్‌గా కోటిలింగాల శశిధర్, సభ్యులుగా బాలాజీ కృష్ణ, ఎంజే స్వరూప్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. చారిటబుల్ ట్రస్టు అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు.

గుడిమల్లం ఆలయాన్ని దర్శించుకున్న జేసీ



గుడిమల్లం ఆలయాన్ని దర్శించిన కాకినాడ జేసీ

ఏర్పేడు(రేణిగుంట) : ఏర్పేడు మండలం గుడిమల్లం పరశురామేశ్వరాలయాన్ని మంగళవారం కాకినాడ జాయింట్ కలెక్టర్ భార్గవి దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో ఆలయ దర్శనానికి వచ్చిన ఆమెకు ఆలయ ఈఓ రామచంద్రారెడ్డి, మాజీ చైర్మన్ బత్తల గిరినాయుడు ఆలయ మర్యాదలతో స్వాగతించి ప్రత్యేక దర్శనం చేయించారు. వేద పండితులచే ఆశీర్వాదం ఇప్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన



ఏర్పేడు : అవగాహన కల్పిస్తున్న ఈవోపీఆర్‌డీ

ఏర్పేడు(రేణిగుంట) : ప్రతి ఒక్కరూ ఇంట్లోనే తడి , పొడి చెత్త వేరుచేసి పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని ఏర్పేడు ఈవోపీఆర్‌డీ రమణకుమార్ కోరారు. మండలంలోని మాధవమాలలో మంగళవారం స్థానికులకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇచ్చి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి విడిగా పారిశుద్ధ్య కార్మికులకు అందించి సంపద కేంద్రాలకు తరలించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సుధాకర్, వినోద్ కుమార్ పాల్గొన్నారు.

మేకల కాపరి మృతి



మృతి చెందిన గోపాలయ్య(ఫైల్)

ఏర్పేడు(రేణిగుంట): ఏర్పేడు మండలం, మేర్లపాక గ్రామంలో పొలంలోకి వెళ్లిన మేకను తరుముతూ ప్రమాదవశాత్తూ కోత మిషన్ కింద పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. మేర్లపాక గ్రామానికి చెందిన అక్కుపల్లి గోపాలయ్య(60) మేకలను మేపేందుకు గ్రామ శివారులోని పంటపొలాల వైపు మంగళవారం తోలుకెళ్లాడు. మేకను తరిమేందుకు పొలంలోకి దిగి తరుముతుండగా అదే పొలంలో వరి కోస్తున్న వరికోత యంత్రం వెనక్కు రావడంతో ప్రమాదానికి గురయ్యాడు. రెండు కాళ్లకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. దీనిపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.

ఈ-పంట నమోదుపై గ్రామసభ



ఈ-క్రాప్ ముసాయిదాను ప్రదర్శిస్తున్న ఏఓ

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలో కుక్కంబాకంలోని గ్రామ సచివాలయం వద్ద ఈ-పంట నమోదుపై మంగళవారం సామాజిక తనిఖీ గ్రామసభను మండల వ్యవసాయాధికారిణి భారతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలో రబీ 2024-25 సీజన్‌కు సంబధించి 28 గ్రామ పంచాయతీల్లోని 3,504 మంది రైతులకు సంబంధించిన 9,149 ఎకరాల భూమిలో పంటల ఈ-క్రాప్ బుకింగ్ పూర్తి అయిందన్నారు. 14 రైతు సేవా కేంద్రాల్లో ఈ-క్రాప్ నమోదుపై సామాజిక తనిఖీ గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్‌బీకేల వద్ద ఈ-క్రాప్ ముసాయిదా జాబితాను ప్రదర్శించి, అన్ని వివరాలను రైతులకు వినిపించటం జరుగుతుందని తెలిపారు. ముసాయిదా జాబితాను పరిశీలించి, అభ్యంతరాలుంటే తెలియజేస్తే సవరణ చేస్తామన్నారు. ఈకేవైసీ చేసుకోని రైతులు ఈనెల 18వ తేదీ లోపు రైతు సేవా కేంద్రాల వద్ద సిబ్బందితో చేయించుకోవాలని తెలిపారు.

విలీన కష్టాలు

- సమీప సచివాలయాలు విలీనం
- క్లస్టర్ల వారీగా విభజన
- ఉద్యోగులకు తప్పని అవస్థలు



గ్రామ సచివాలయం

సత్యవేడు : సచివాలయ సేవలను కూటమి ప్రభుత్వం హేతుబద్ధీకరణకు నిర్ణయించింది. ఇందులో భాగంగా సచివాలయాలను క్లస్టర్లుగా విభజించనున్నారు. ఈ మేరకు విధి విధానాలు తయారు చేయా లని సచివాలయ పాలనా విభాగం, మండల పరిషత్‌లకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో అధికారులు కసరత్తు ప్రారంభించారు. గ్రామ సచివాలయాల్లో 11 మంది, పట్టణాల్లోని వార్డు సచివాలయాల్లో 9 మంది చొప్పున సిబ్బంది ఉంటారు. ప్రస్తుతం వీరిని మూడు విభాగాలుగా విభజించనున్నారు. బహుళార్థక విభాగంలో 4 కేటగిరీల ఉద్యోగులైన పంచాయతీ కార్యదర్శి, డిజిటల్, సంక్షేమ సహాయకులు, మహిళా సంరక్షణ కార్యదర్శి ఉంటారు. వీరు సర్వేలు చేపడతారు. ఇతర సేవలు క్లస్టర్ స్థాయిలో అందిస్తారు. సాంకేతిక..వ్యవసాయ, ఉద్యాన, ఇంజినీరింగ్, ఆరోగ్య, పశుసంవర్ధక, విద్యుత్ సహాయకులు, సర్వేయర్లు ఉంటారు. సాంకేతికతలో ప్రవేశం ఉన్న ఉద్యోగులను గుర్తించి ఈ విభాగంలో చేర్చనున్నారు. వీరిని ఐటీ అవసరాలకు వినియోగించే వీలుంది.

ఎంపీడీఓల ఆధ్వర్యంలో..

ప్రతి మండలంలో సమీపంలో ఉన్న సచివాలయాలను క్లస్టర్లుగా పరిగణిస్తారు. సచివాలయాలు సరి సంఖ్యలో ఉంటే సగం క్లస్టర్లు ఏర్పాటవుతాయి.బేసిసంఖ్యలో ఉంటే ఒక క్లస్టర్ పరిధిలోకి మూడు సచివాలయాల తీసుకొస్తారు. బహుళార్థక విభాగంలో జనాభా ప్రాతిపదికన, సాంకేతిక విభాగంలో క్లస్టరు పరిధిలో ఉద్యోగులను గుర్తిస్తారు. వీరు రెండేసి సచివాలయాల్లో పని చేయాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. క్లస్టర్ విభజన చర్యలను ఎంపీడీఓ నిర్వహిస్తారు . మండలంలో సచివాలయాలు 17, ప్రతిపాదిత క్లస్టర్లు సుమారు 8, ఉద్యోగులు 113 మంది ఉన్నారు.

రోడ్డు మరమ్మతు చేపట్టాలని నిరసన



అనంతపురం గ్రామం వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని కేటీ రోడ్డు నుంచి జంబుగోళం గ్రామానికి వెళ్లే గుంతల రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని మంగళవారం గ్రామస్తులు ఆర్.అనంతపురం గ్రామం వద్ద రోడ్డుపై నిరసన తెలిపారు. కేటీరోడ్డు నుంచి జంబుగోళం గ్రామానికి వెళ్లే రహదారి గుంతలమయమై అధ్వాన్నంగా ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డులో మోకాటి లోతు వరకు గుంతలు ఉండడంతో ఆర్టీసీ బస్సులను తిప్పటం మానేశారని వాపోయారు. ఆటోలు సైతం తిప్పడం లేదని, ద్విచక్ర వాహనదారులు గుంతల్లో పడి ఆసుపత్రుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నవంబరులో కురిసిన భారీ వర్షాలకు రోడ్డు దెబ్బతిందని, మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలో ఫీల్డ్ అసిస్టెంట్ తొలగింపు



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్

నాగలాపురం : స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ నిర్వహించారు. తనిఖీలో 2023 ఏప్రిల్1 నుంచి మార్చి 2024వ తేదీ వరకు జరిగిన ఉపాధి పనులు, గతనెలలో 12వ తేదీ నుంచి 28వ తేదీ వరకు సామాజిక తనిఖీ నిర్వహించారు. తనిఖీలో భాగంగా మండలంలోని వేంబాక్కం ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ నారాయణపై పలు అభియోగాలు నిర్ధారణ కావడంతో పాటు రూ.76 వేలు దుర్వినియోగానికి పాల్పడినట్లు తనిఖీలో వెల్లడైంది. దీంతో ఫీల్డ్ అసిస్టెంట్ నారాయణను విధుల నుంచి తొలగించినట్లు పీడీ వెల్లడించారు. అదే విధంగా ఇతర ఫీల్డ్ అసిస్టెంట్‌ల వద్ద రూ.5 వేల జరిమానా వసూలు చేశారు. ప్రస్తుతం వేసవిలో ఉపాధి కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ వంద రోజుల పని కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి శివయ్య, ఏపీడీ సరిత, ఎంపీడీఓ వెంకటరత్నమ్మ, ఏపీఓ సుధాకర్, ఎస్‌ఆర్పీ రవి, జెట్పీటీసీ, ఎంపీటీసీ, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రికార్డులు లేని వాహనాలకు జరిమానా



ట్రాక్టరు లోడ్‌పై ఉన్న కూలీలను దించుతున్న ఎంవీఐ

బుచ్చినాయుడుకండ్రిగ : రికార్డులు సక్రమంగా లేని రెండు ట్రాక్టర్లు, లారీకి రూ. 65 వేలు జరిమానా విధించినట్లు శ్రీకాళహస్తి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ దామోదార్‌నాయుడు తెలిపారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్ వద్ద వాహనాల రికార్డులను తనిఖీ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనానికి సంబంధించిన అన్ని రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని, దీంతో జరిమానాతో పాటు జైలుకు వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు. తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలన్నారు. లోడు ట్రాక్టరు, లారీలపై కూలీలను ఎక్కించకూడదని తెలిపారు.

తప్పిన ప్రమాదం



మట్టిలో కూరుకుపోయిన కారు

శ్రీకాళహస్తి : తొట్టంబేడు మండలం చెన్నై బైపాస్ లింకు రోడ్డు వద్ద గ్యాస్ పైప్ లైన్లు మరమ్మతుల కోసం తీసిన గోతిలో ఒకరు ప్రమాదవశాత్తు పడబోయి డ్రైవర్ అప్రమత్తతో తృటిలో తప్పింది. రోడ్డు పక్కన గ్యాస్ లైన్ ఏర్పాటు కోసం తీస్తున్న గోతుల వద్ద ఏ విధమైన భద్రతా చర్యలు పాటించడం లేదని ప్రజలు వాపోతున్నారు. ప్రస్తుతానికి చిన్న చిన్న ప్రమాదాలు తరచూ జరుగుతూనే ఉన్నాయి . అవి పెద్ద ప్రమాదాలుగా మారకముందే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు హాస్టల్ అదనపు గదుల నిర్మాణానికి భూమిపూజ

సత్యవేడు : పంచాయతీ పరిధిలోని బీసీ కాలనీలో ప్రభుత్వ కళాశాల బీసీ బాలుర వసతి గృహ ప్రాంగణంలో బుధవారం అదనపు గదుల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించనున్నారు. శ్రీసిటీ లోని ఎస్‌ఎస్ ఇన్స్ట్రుమెంట్ కంపెనీ హాస్టల్ నిర్మాణానికి రూ. 52 లక్షలు నిధులు మంజూరు చేశారు. శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి సహకారంతో కంపెనీ ముందుకొచ్చింది. గత వాకం కంపెనీ ప్రతినిధులు హాస్టల్‌ను సందర్శించి అవసరమైన స్థలాన్ని గుర్తించారు. రేపు 10 గంటలకు కంపెనీ ప్రతినిధులు, మండల అధికారులు , ముఖ్యఅతిథులతో భూమి పూజ నిర్వహించనున్నట్లు వార్డన్ గంగాధర్ తెలిపారు.

రోడ్డుకు మరమ్మతులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : రేణిగుంట జీఎం వీధి నుంచి డాక్టర్ బ్రహ్మానందం హాస్పిటల్‌కు వెళ్లే సర్వీస్ రోడ్డు మొదట్లో ఉన్న సమస్యపై గత వారం ఆశా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు పంచాయతీ ఈఓకు వినతి పత్రాన్ని అందజేశారు. అందులో భాగంగా మంగళవారం సర్పంచ్ నాగేషం తన సొంత డబ్బులతో కాంక్రీట్ వేసి మరమ్మతు పనులను చేసి సమస్యను పరిష్కరించారు.

యువత పోరును విజయవంతం చేద్దాం



నూకతోటి రాజేష్, సమన్వయకర్త

వరదయ్యపాళెం : వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10 గంటలకు తిరుపతి జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే యువత పోరు నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. విద్యార్థులకు అందాల్సిన వసతి దీవెన, విద్యాదీవెన, బకాయిల చెల్లింపుల్లో నిర్లక్ష్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం తీరుకు నిరసనగా చేపడుతున్న యువత పోరు నిరసన కార్యక్రమానికి సత్యవేడు నియోజకవర్గంలోని 7 మండలాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, యువత, విద్యార్థుల తల్లిదండ్రులు హాజరై మద్దతు పలకాలని కోరారు.

తీరిన గిరి పుత్రుల నీటి కష్టాలు



కొత్త మోటార్ బిగిస్తున్న పంచాయతీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

శ్రీకాళహస్తి : తొట్టంబేడు మండలం బసయపాలెం ఎస్టీ కాలనీలో నెల రోజులుగా పడిన తాగునీటి కష్టాలు బుధవారం పరిష్కారమయ్యాయి. గిరిజనులు ఇబ్బంది పడుతున్నారని మోటారు పాడై నెలరోజులవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని మంగళవారం 'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనంతో అధికారులు స్పందించారు. కొత్త మోటార్‌ను ఏర్పాటు చేసి గిరిజనులకు తాగునీరు అందజేశారు.

ప్రదోష పూజలు



మండపంలో పూజలు చేస్తున్న అర్చకులు

నాగలాపురం : మండలంలోని శ్రీ పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ప్రదోష పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేశన్ గురుక్కల్ ఆలయంలోని నందీశ్వర స్వామికి , శ్రీ వాల్మీకిశ్వర స్వామికి ఏక కాలంలో పూజలు నిర్వహించారు. ప్రదోష పూజలకు ప్రసాదాలు నింద్ర గ్రామానికి శ్రీనివాస మిల్క్ డైరీ ఎండీ వాసుదేవనాయుడు, వారి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. వారికి ఆలయ మర్యాదలతో దర్శన ఏర్పాట్లు చేసి ప్రసాదాలు అందించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి పి.లత ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అంగన్‌వాడీ కేంద్రానికి నిప్పు



కాలిపోయిన అంగన్‌వాడీ కేంద్రం తలుపులు

నాగలాపురం: పిచ్చాటూరు మండలంలోని కారురు గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి మద్యం మత్తులో గుర్తుతెలియని వ్యక్తి నిప్పంటించిన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం.. పిచ్చాటూరు మండలం, కారూరు ఎస్టీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం తలుపులకు గుర్తుతెలియని వ్యక్తి నిప్పంటించాడు. విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే మంటలను అదుపు చేశారు. ఈ మేరకు అంగన్‌వాడీ సిబ్బంది స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇసుక అక్రమ రవాణాపై మెరుపు దాడి





ఇసుకను సీజ్ చేసిన సత్యవేడు సీఐ మురళీనాయుడు, పోలీసులు సీజ్ చేసిన ఇసుక నిల్వలు

నాగలాపురం: మండలంలోని ఎస్ఎస్‌పురం గ్రామ సమీపంలో ఇసుకను అక్రమంగా డంపింగ్ చేసి నిల్వ ఉంచి రాత్రి సమయంలో తమిళనాడుకు తరలిస్తున్నారని సత్యవేడు సీఐ మురళినాయుడుకు పక్కా సమాచారం అందింది. ఈ మేరకు సీఐ తన సిబ్బందితో కలిసి మంగళవారం ఎస్.ఎస్.పురం గ్రామ సమీపంలో అనుమతి లేకుండా డంపింగ్ చేసి ఉన్న ఇసుకను సీజ్ చేశారు. ఆ ప్రాంతాన్ని పరిశీలించి రాత్రి పూట ఇసుకను ట్రాక్టర్లలో తమిళనాడుకు తరలిస్తున్నట్టుగా కొన్ని ఆనవాళ్లు గుర్తించారు. ఈ మేరకు అక్రమంగా డంపింగ్ చేసి ఉంచిన 15 యూనిట్ల ఇసుకను సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించారు. నాగలాపురం ఎస్ఐ సునీల్, సత్యవేడు ఎస్ఐ రామస్వామి, వీఆర్వో మహేష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఇసుక డంప్ సీజ్

సత్యవేడు: మండలంలోని అల్లపుగుంట గ్రామ సమీపంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌ను సత్యవేడు సీఐ మురళీ సీజ్‌చేశారు. ప్రభుత్వ రీచ్‌ల నుంచి తీసుకొచ్చిన ఇసుకను కొంత మంది తమిళనాడుకు తరలించేందుకు నిల్వ చేస్తున్నారు. విషయం తెలుసుకున్న సీఐ దాదాపు 15 యూనిట్ల ఇసుక డంప్‌ను సీజ్ చేశారు.

పర్యావరణహితంగా శ్రీసిటీ



శ్రీసిటీలో చేపట్టనున్న పర్యావరణహిత సుస్థిర చర్యల లోగో

శ్రీసిటీ (వరదయ్యపాళెం): ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) చైర్మన్ డా. కృష్ణయ్యతో ఇటీవల చర్చల అనంతరం, శ్రీసిటీని మరింత పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దేందుకు, శ్రీసిటీ యాజమాన్యం తన పారిశ్రామిక భాగస్వాములతో కలిసి స్థిరమైన వనరుల వినియోగ విధానాలను మరింత బలోపేతం చేస్తోంది. 'రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్' అనే వృత్తాకార ఆర్థిక వ్యవస్థ మూల సూత్రాల ఆధారంగా పర్యావరణ హాని గణనీయంగా తగ్గించే చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా అన్ని నివాస, వాణిజ్య, పారిశ్రామిక ప్రాజెక్టుల నిర్మాణ పనులలో నది ఇసుక వాడకానికి ప్రత్యామ్నాయమైన ఎం-సాండ్ (గ్రానైట్ రాళ్లను పొడిచేయడం ద్వారా తయారయ్యే ఇసుక) ను విధిగా 90 శాతం ఉపయోగించాలని నిర్ణయించింది. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డా. రవీంద్ర సన్నారెడ్డి దీనిపై వ్యాఖ్యానిస్తూ, హరిత నగర లక్ష్యాన్ని సాధించే దిశగా సుస్థిర వనరుల నిర్వహణ , పర్యావరణహిత కార్యకలాపాలను అమలు చేయడంలో శ్రీసిటీ ఎప్పుడూ ముందుందన్నారు. కాలుష్య రహిత ఇంధన (క్లీన్ ఎనర్జీ) వినియోగాన్ని వేగవంతం చేసేందుకు, ఏజీ ఆర్ పీ పైప్‌లైన్ నెట్‌వర్క్ ద్వారా కంప్రెస్డ్ న్యాచురల్ గ్యాస్ (సి.ఎన్.జి)ను శ్రీసిటీ అందుబాటులోకి తెస్తోందన్నారు.

'పది' విద్యార్థులకు పరీక్షా సామగ్రి వితరణ



పరీక్షా సామగ్రితో విద్యార్థులు, ఫౌండేషన్ సభ్యులు

శ్రీకాళహస్తి : పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పిళ్లారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి చదువుతున్న 162 మంది విద్యార్థులకు పరీక్షా సామగ్రిని వితరణ చేశారు. సంస్థ అధ్యక్షురాలు అమరావతి మాట్లాడుతూ.. విద్యార్థులు పరీక్షలు బాగా రాసి మంచి ఉత్తీర్ణత శాతం సాధించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేణిగుంట : శ్రీకాళహస్తి మండలం ముచ్చువోలు హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం శ్రీకాళహస్తికి చెందిన పిళ్లారి ఫౌండేషన్ ప్రతినిధులు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. సంస్థ అధినేత్రి అమరావతి సునీత, హెచ్ఎం రమేష్‌బాబు చేతుల మీదుగా విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లలిత, నాగరాజు, వినోద్‌కుమార్, చిరంజీవులు, నరసింహయ్య పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ల టెండర్లు పూర్తి చేయాలి

– అసెంబ్లీలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



వరదయ్యపాళెం : సత్యవేడు నియోజకవర్గంలోని పిచ్చాటూరు మండలం ముడియూరు, సత్యవేడు మండలం చమర్తకండ్రిగ ప్రాంతాలలో సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వం మంజూరు చేసిందని, అయితే పనులు చేపట్టేందుకు టెండర్ల ప్రక్రియ ఆలస్యం చేస్తోందని స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మంగళవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో ప్రస్తావించారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు చేపట్టాలని కోరారు. అలాగే పిచ్చాటూరు, బీఎన్‌కండ్రిగ మండలాల్లో బాలికల హైస్కూల్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. బీఎన్‌కండ్రిగ, నారాయణవనం, నాగలాపురం మండలాల్లో అర్ధంతరంగా ఆగిపోయిన పాఠశాలల భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరారు.

మండుతున్న ఎండలు

- ఉగ్రరూపం దాల్చుతున్న భానుడు
- రోడ్లపై కనిపించని జన సంచారం
- రాత్రి చలి, పగలు ఎండతో విభిన్న వాతావరణం





పుచ్చకాయలు కొనుగోలు చేస్తున్న జనం, మధ్యాహ్నం వేళ ఖాళీగా దర్శమిస్తున్న ప్రధాన రహదారి

బుచ్చినాయుడుకండ్రిగ : ఎండ వేడిమికి ప్రజలు అల్లాడిపోతున్నారు. మార్చి రెండో వారంలోనే ఎండలు దడ పుట్టిస్తున్నాయి. రోజురోజుకూ పగటి ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. రెండు రోజులుగా మండలంలో పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్‌కు పైగా నమోదవుతున్నాయి. ఆరంభంలోనే ఎండలు దంచి కొడుతుండటంతో మున్ముందు మరెంత తీవ్రంగా ఉంటాయోననే ఆందోళనలు ప్రజల్లో వ్యక్తమవుతోంది. మండలంలో కనిష్ఠ, గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. మండల పరిధిలో రాత్రి వేళ ఉష్ణోగ్రతల్లో కొంత మేర మార్పు కనిపిస్తోంది. అర్ధరాత్రి నుంచి చలి తీవ్రతలు, పగటి వేళల్లో ఎండ వేడిమితో విభిన్న వాతావరణం నెలకొంది. సాధారణంగా మార్చి నెలల్లో నమోదయ్యే ఉష్ణోగ్రతల్లో కంటే ఈ ఏడాది ఉష్ణోగ్రతలు 2, 3 డిగ్రీలు అదనంగా నమోదవుతాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

రోడ్లపై లేని జన సంచారం

ఎండల కారణంగా మండలంలో మధ్యాహ్న సమయంలో రోడ్లపై జన సంచారం కనిపించడంలేదు. అత్యవసరమైతే తప్ప బయటకు వచ్చేందుకు ప్రజలు ఇష్టపడటం లేదు. సాయంత్రం 5 గంటల వరకు ఎండ తీవ్రత తగ్గడం లేదు. మరికొన్ని రోజుల వరకు ఎండ తీవ్రత ఇలాగే కొనసాగుతుందని వాతావరణ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఎల్లప్పుడు రద్దీగా ఉండే కేటీరోడ్డు ఖాళీగా దర్శమిస్తుంది.

మార్కెట్‌ను ముంచెత్తుతున్న పుచ్చకాయలు, కొబ్బరి కాయలు

ఎండలు తీవ్రత ఎక్కువ అవుతుండటంతో చల్లదనాన్ని అందించే పుచ్చకాయలు, నీళ్ల టెంకాయలు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. మండలంలోని వేణుగోపాలపురం, పీవీకండ్రిగ, పుత్తేరి, ఆలత్తూరు, గ్రామాలతో పాటు పలు గ్రామీణ ప్రాంతాల్లో సాగు చేసిన పుచ్చకాయలు వాహనాల్లో తీసుకొచ్చి అమ్ముతున్నారు. అలాగే నీళ్ల టెంకాయలను తోపుడు బండ్లపై విరివిగా అమ్ముతున్నారు. వీటితో పాటు నన్నారి షరబత్, మజ్జిగ, లస్సీ, ఫ్రూట్ జ్యూస్ షాపులకు జనాల తాకిడి పెరిగింది. ఉక్కపోతలు ఆరంభం కావటంతో ప్రజలు కూలర్లు తదితర వాటిని సిద్ధం చేసుకుంటున్నారు.

పాముకాటుకు వృద్ధురాలి మృతి

రేణిగుంట : శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరికి చెందిన సావిత్రమ్మ(70) మంగళవారం పాముకాటుకు గురై మృతి చెందింది. గ్రామానికి చెందిన సావిత్రమ్మ మూగ, చెవిటి దివ్యాంగురాలు. బహిర్భూమికి వెళ్లి, అక్కడ పాముకాటుకు గురైంది. ఇంటికి వచ్చే సరికి నోట్లో నురగ రావడంతో ఆస్పత్రికి తీసుకెళుతుండగా మృతి చెందింది.